క్లుప్తంగా

సినీనటి అన్నపూర్ణ సందడి


శివాజీపాలెంలో దేవీ మండపం వద్ద సినీనటి అన్నపూర్ణతో స్థానికులు

మద్దిలపాలెం : ప్రముఖ సీనియర్ సినీనటి అన్నపూర్ణ మంగళవారం జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెంలో ఏర్పాటు చేసిన శరన్నవరాత్రి ఉత్సవ మండపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నపూర్ణను మాజీ కార్పొరేటర్ బొట్టా నీలిమ, బొట్టా వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు.

వంశీకృష్ణతో సిక్కు వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ భేటీ


ఎమ్మెల్సీ వంశీకృష్ణతో సిక్కు వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ దిలషాసింగ్ ఆనంద్

మద్దిలపాలెం : రాష్ట్ర సిక్కు వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన డాక్టర్ దిలషా సింగ్ ఆనంద్ ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌ను మంగళవారం శివాజీపాలెంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వంశీకృష్ణకు శాలువా కప్పి సత్కరించారు. చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని వంశీకృష్ణ ఆయనకు సూచించారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటుకు డిమాండ్


ఆరిలోవ: మ్యాక్సీ వర్కర్స్ యూనియన్ సభ్యులు మంగళవారం ముడసర్లోవ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు షేక్, కార్యదర్శి రెహమాన్ మాట్లాడుతూ మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు భద్రతతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ చలానా కేసులను ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మ్యాక్సీ వర్కర్ యూనియన్ సభ్యులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

అలరించిన భక్తిగీతాల భజనలు


భక్తి కీర్తనలతో భజన కార్యక్రమం

మద్దిలపాలెం : శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పీతవానిపాలెంలో శ్రీకృష్ణా యువజన సేవా సంఘం ఆధర్వ్యంలో మంగళవారం భక్తి గీతాల భజన కార్యక్రమం నిర్వహించారు. గాజువాకకు చెందిన భజన బృందం చక్కని భక్తి గీతాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఖాదీ మహోత్సవం


ఖాదీ మహోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఖాదీ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కళాశాల జాతీయ సేవా పథకం బృందం ఆధ్వర్యంలో ఖాదీ వస్త్రాల విక్రయ స్టాళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ఎన్ఎస్ఎస్ అధ్యాపకులు ఉమా మహేశ్వరరావు, శ్యాముల్ డేవిడ్‌రాజు, ప్రతాప్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా..


13వ వార్డు యూపీహెచ్‌లో ఓపీ నమోదు చేస్తున్న సిబ్బంది


11వ వార్డు యూపీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్డు అందిస్తున్న కార్పొరేటర్ రోహిణి, జెడ్సీ కనకమహాలక్ష్మి

- కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- విస్తృతంగా రక్త పరీక్షలు.. మందుల పంపిణీ


అప్పుఘర్‌లో ప్రజలకు పరీక్షలు చేస్తున్న ఆశా వర్కర్లు


20వ వార్డులో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆరిలోవ: ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 7న ప్రారంభమైన ఈ శిబిరాలు ఈ నెల 25 వరకు జరగనున్నాయి. మంగళవారం జీవీఎంసీ 11, 13వ వార్డుల యూపీహెచ్‌లలో ఈ శిబిరాలు జరిగాయి. 11వ వార్డు బాలాజీనగర్ యూపీహెచ్‌సీలో 12వ వార్డు పరిధి 21వ సచివాలయానికి సంబంధించిన ప్రజల కోసం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి సందర్శించారు. ఇక్కడ రోగుల కోసం ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ఏయే ఆరోగ్య సమస్యల పరిష్కారానికి రోగులు వచ్చారో వైద్యాధికారి కిరణ్‌లలితను అడిగి తెలుసుకున్నారు.ఈ శిబిరంలో 132 మంది వైద్య సేవలు పొందారు. 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీలో ఉన్న యూపీహెచ్‌సీలో ఏడో నంబరు సచివాలయం ప్రజల కోసం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జెడ్సీ కనకమహాలక్ష్మి పరిశీలించారు. ఈ శిబిరంలో 280 మందికి సేవలు అందించినట్లు వైద్యాధికారి సుమన్ తెలిపారు.

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డు సచివాలయాల పరిధిలో మంగళవారం ఎంవీపీ కాలనీ అప్పుఘర్‌లో ప్రాథమిక పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 18వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, వార్డు సీనియర్ నాయకుడు పుక్కళ్ల శంకర్ ఏర్పాట్లు చేశారు. ఈ శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు వైద్యాధికారి పద్మావతి తెలిపారు. ఐదుగురికి మెరుగైన వైద్య సేవల నిమిత్తం సిఫార్స్ చేశారు. వైద్య పరీక్షల అనంతరం మందులు పంపిణీ చేశారు. 40 మందికి కళ్ల పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అందించారు.

ఏయూ క్యాంపస్: ప్రజల ఆరోగ్యానికి రక్షగా జగనన్న సురక్ష కార్యక్రమం నిలుస్తోందని 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి అన్నారు. మంగళవారం ఉదయం 20వ వార్డు పరిధి సచివాలయం నంబరు 96(కాగితాలవారి వీధి)కి సంబంధించిన జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరం చినవాల్తేరు ఆరోగ్య కేంద్ర ఆవరణలో జరిగింది. కార్పొరేటర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యమే పరమావధిగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. అనంతరం ఉదయం 9 గంటల నుంచి నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో 223 మందికి పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి అక్కడే మందులు అందజేశారు. పలువురిని కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు మువ్వల సురేష్, కన్వీనర్స్ వై.రమణారెడ్డి, కాగితాల లక్ష్మణరెడ్డి, టి.శ్రీకాంత్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా జగనన్న పాలన


రామకృష్ణాపురంలో మహిళతో మాట్లాడుతున్న ఎంవీవీ

ఆరిలోవ: పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తున్నారని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 13వ వార్డులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ కెల్ల సునీత, స్థానిక నాయకులతో కలసి ఎంపీ రామకృష్ణాపురంలో ఇంటింటికీ వెళ్లారు. మహిళలు, వృద్ధులు, యువకులను పలకరించి, సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులతో మాట్లాడి పథకాలు అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, వంకటర బాబూరావు, కాకర గోవింద్, బేగం, వెంకటరెడ్డి, భాస్కర్, శిరీషా, శ్రీనివాస్, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ విజేతలకు అభినందన

మర్రిపాలెం : పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలు సాధించిన విజేతలను ఆర్కే ఫిట్‌నెస్ మంత్ర అధినేత గున్న రామకృష్ణారావు అభినందించారు. ఈ నెల 5 నుంచి 10 వరకు నేపాల్‌లో జరిగిన ఎస్‌బీకేఎఫ్ 8వ అంతర్జాతీయ క్రీడల్లో గోల్డ్‌మెడల్ సాధించిన సీహెచ్ అప్పలరాజు, ఆర్ గణేష్, ఆర్.కుమార్, నారాయణ, సుధాకర్‌లను ఈ సందర్భంగా మంగళవారం ఆయన కార్యాలయంలో వారిని సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలమరశెట్టి శ్రీనివాసరావు, రాపేటి రాము, కోన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం...

అంబేడ్కర్ విధానాలతో పేదరిక నిర్మూలన సాధ్యం

ఏయూ క్యాంపస్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విధానాలతో పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. మంగళవారం సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతదేశంలో పేదరికం- సమస్యలు, నిర్మూలన వ్యూహాలు అనే అంశంపై జాతీయ వెబ్‌నార్ జరిగింది. వర్చువల్ విధానంలో నిర్వహించిన ఈ సదస్సులో రిజిస్ట్రార్ మాట్లాడుతూ పేదరికాన్ని అన్ని విధాలా నిర్మూలించాలన్న అంబేడ్కర్ సిద్ధాంతాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని కొనియాడారు. కేంద్రం డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ పేదరికం అనేది కేవలం ఆర్థిక సమస్య కాదన్నారు. ఏయూ ఆంత్రోపాలజీ డిపార్ట్‌మెంట్ ఎమెరిటస్ ప్రొఫెసర్ వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పేదరికం స్థాయిలు గ్రామీణ, గిరిజన, పట్టణ ప్రాంతాల వారీగా మారుతుంటాయన్నారు. ఏయూ రాజనీతి శాస్త్రం-పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పీవోపీ డాక్టర్ సులేమాన్ మాట్లాడుతూ ఆదాయ అసమానతలు, మురికివాడల్లో నివాసం ఉండడం పట్టణ పేదరికానికి ఉదాహరణ అన్నారు. ఉపాధి హామీ పథకం, ప్రధాన్ మంత్రి జన్‌దన్ యోజన, నగదు బదిలీ కార్యక్రమాలు, సమాచారం-విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉద్యోగ కల్పన, నైపుణ్యాల అభివృద్ధి వంటి పథకాలు పేదరిక నిర్మూలనకు కీలకమన్నారు. ఈ సదస్సులో 150 మంది అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్యాపకులపై గురుతుర బాధ్యత


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్: పటిష్టమైన బోధన వ్యవస్థతో మెరుగైన సమాజం నిర్మాణం సాధ్యపడుతుందని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. మంగళవారం ఉదయం ఏయూ ఐఏఎస్ఈ ప్రాంగణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం దూర విద్య బీఈడీ విద్యార్థుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు దేశ ప్రగతికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారన్నారు. జాతీయ నూతన విద్యా విధానం లక్ష్యాలను చేరుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ మాట్లాడుతూ భవిష్యత్ తరాన్ని తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. శిక్షణ తరగతుల సమన్వయకర్త ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ బీఈడీ చదివే ప్రతి విద్యార్థికి బోధన విధానాలు, చిన్నారుల మానసిక పరిణితి, సోషియాలజీ, ఫిలాసఫీ వంటి అంశాలను అవగాహన కల్పిస్తామన్నారు. ఆచార్య డి.నాగరాజకుమారి మాట్లాడుతూ ఐదు రోజుల వర్క్‌షాప్‌లో అందించే శిక్షణ కార్యక్రమాన్ని వివరించారు.

ఐక్యూఏసీ సమావేశ మందిరం ప్రారంభం


సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంటర్నల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ సెల్(ఐక్యూఏసీ)లో నూతన సమావేశ మందిరం(బోర్డ్ రూమ్)ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మంగళవారం ప్రారంభించారు. వివిధ సంస్థల ప్రతినిధులు తరచూ ఏయూ ఐక్యూఏసీ కార్యాలయాన్ని సందర్శిస్తుంటారు. వారితో చర్చించడానికి ఉపయుక్తంగా ఆధునిక వసతులతో దీనిని తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.శ్రీనివాసరావు, వై.రాజేంద్రప్రసాద్, టి.శోభశ్రీ, ఎస్.కె.భట్టి, వి.విజయలక్ష్మి, పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఆచార్య డి.లలితభాస్కరి, తదితరులు పాల్గొన్నారు.

సాంబిరెడ్డికి సత్కారం


సాంబిరెడ్డిని సత్కరిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఏయూ పాలక మండలి సభ్యుడిగా సాంబిరెడ్డి నియామకం కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం సాయంత్రం ఏయూ విశ్రాంత ఆచార్యులు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ క్లబ్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. సాంబిరెడ్డిని విశ్రాంత ఆచార్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య బళ్ల అప్పారావు, వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, పరమేశ్వరరావు, చంద్రమౌళి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాయత్రిమాతగా దుర్గమ్మ


గాయత్రి మాతగా లలితాదేవి


పోలమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న అక్కరమాని వెంకటరావు


రేసపువానిపాలెంలో గాయత్రిదేవి అలంకరణలో భూలోకమాత


చైతన్యనగర్‌లో కనకదుర్గా ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఏయూ క్యాంపస్: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడో రోజు మంగళవారం దుర్గమ్మ.. గాయత్రి మాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏయూ అవుట్‌గేట్ వద్దనున్న లలితా సుందరేశ్వర పీఠంలో తెల్లవారుజామున లలిత త్రిపుర సుందరి అమ్మవారికి పంచామృత అభిషేకం, సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం శ్రీగాయత్రి దేవి ఆవరణార్చనతో శ్రీచక్రార్చన జరిపారు.

➤ పోలమాంబ ఆలయంలో అమ్మవారు గాయత్రి మాతగా దర్శనమిచ్చారు. శ్రీవరాహ నరసింహ భజన మండలి సభ్యులు పారాయణం, సాయంత్రం కె.జె.నారాయణతో పార్వతి కళ్యాణం హరికథ గానం ఏర్పాటు చేశారు. అమ్మవారిని ఉదయం వైఎస్ఆర్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ శంకరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం : జీవీఎంసీ 23వ వార్డు చైతన్యనగర్‌లోని హయత్‌నగర్ కాలనీలో ఉన్న కనకదుర్గా ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

గాయత్రిదేవి అవతారంలో భూలోకమాత

మద్దిలపాలెం : రేసపువానిపాలెంలో సీఎంఆర్ సెంట్రల్‌కు ఆనుకుని ఉన్న భూలోకమాత అమ్మవారు మూడో రోజు మంగళవారం గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అన్నపూర్ణ దేవిగా చండికాదేవి దర్శనం

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్-4లోని శ్రీచండికాదేవి ఆలయంలో మంగళహారతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారు శ్రీఅన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీవెంకటకృష్ణ అన్నమాచార్య సంస్థ ఆధ్వర్యంలో కోలాట బృందం ప్రత్యేక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ, కార్యదర్శి ఉమాదేవి, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు

రొమ్ము క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం


మాట్లాడుతున్న మురళీకృష్ణ

సీతమ్మధార : అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రొమ్ము క్యాన్సర్‌ను నయం చేయవచ్చని మహాత్మాగాంధీ క్యాన్సర్ రీసెర్చ్ హాస్పటల్ అధినేత డాక్టర్ వూన మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ఆశీలమెట్టలోని ఓ హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్‌లలో అత్యాధునిక తర్ఫీదు పొందిన అంకాలజిస్టులు అందుబాటులో ఉన్నారన్నారు. 18 ఏళ్లగా 8,500 మంది రొమ్ము క్యాన్సర్ బాధితులకు విజయవంతంగా చికిత్సలు చేసినట్టు తెలిపారు. మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్యసేవలందిస్తోందన్నారు.

డెంగ్యూపై యుద్ధం

- ఇంటింటి సర్వేతో లార్వా తొలగింపు
- ప్రత్యేకంగా 399 మంది సిబ్బంది నియామకం
- బావులు, చెరువుల్లో 8 లక్షల గంభూషియా చేపల విడుదల
- జీవీఎంసీ పరిధిలో నెలకు నాలుగు సార్లు ఫాగింగ్


వీధులలో మెగా ఫాగింగ్


బావిలో గంభూషియా చేపలు వదులుతున్న జెడ్సీ శివప్రసాద్, బయాలజిస్ట్ సాంబమూర్తి(ఫైల్)


గంభూషియా చేపలు

మద్దిలపాలెం: డెంగ్యూ కట్టడికి ప్రభుత్వ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. నగరంలో పెరుగుతున్న డెంగ్యూ కేసుల సంఖ్య దృష్ట్యా జీవీఎంసీ పరిధిలోని 98 వార్డుల్లో ప్రత్యేక నివారణ చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మలేరియా విభాగంలో యాంటీ లార్వా ఆపరేషన్ కోసం తాత్కాలిక పద్ధతిపై 399 మంది సిబ్బందిని నియమించారు. మరో వైపు సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మలేరియా సిబ్బంది విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ఇంటింటి సర్వే చేస్తున్నారు.

విస్తృతంగా ఫాగింగ్..

నగరంలో డెంగ్యూ కట్టడికి 399 మందిని తాత్కాలిక ప్రాతిపదికన నియామకం చేశారు. వీరంతా అన్ని ఇళ్లు, పరిసరాలు తనిఖీలు చేసి నీటి నిల్వలను తొలగించే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇలా ప్రతి ఇంటిని నెలలో నాలుగు సార్లు తనిఖీ చేసేలా కార్యాచరణ రూపొందించారు. రోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సర్వే చేస్తున్నారు. ప్రతి వార్డులో నెలలో నాలుగు సార్లు ఫాగింగ్ ప్రక్రియ చేపడుతున్నారు. మరోవైపు ప్రజలను భాగస్వాములను చేస్తూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. జీవీఎంసీ పరిధిలోని 98 వార్డుల్లో నెలకు రెండు సార్లు ఫాగింగ్ ప్రక్రియ చేపడుతున్నారు. 8 మెగా ఫాగింగ్ మిషన్లతో 16 మంది సిబ్బంది పని చేస్తున్నారు. అలాగే 55 మినీ ఫాగింగ్ మిషన్లతో 110 మంది విధులు నిర్వహిస్తున్నారు.


యాంటీ లార్వా ఆపరేషన్


ఫ్రైడే డ్రైడేలో నీటి నిల్వలు తొలగిస్తున్న ఏఎన్ఎం, ఆశాలు

డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతంలో 150 ఇళ్లలో యాంటీ లార్వా ఆపరేషన్ ప్రక్రియ చేపడుతున్నారు. ఇంటింటి సర్వేలో గుర్తించిన నిల్వ నీటిని తొలగించడం, సంపులు, ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నారు. డెంగ్యూ కేసు నమోదైన ఇంట్లో ఇండోర్ స్ప్రెయింగ్(ఐఎస్ఎస్)లో పైరాత్రిన్ కెమికల్‌ను పిచికారీ చేస్తున్నారు. ఈ ప్రక్రియను ఒక మలేరియా ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో సూపర్‌వైజర్‌తో పాటు నలుగురు సిబ్బంది నిర్వహిస్తున్నారు.

➤ చెరువులు, బావులు దోమల ఉత్పత్తి కేంద్రాలు. వీటిలో దోమల నివారణకు గంభూషియా చేపలు విడిచిపెట్టారు. ఈ చేపలు దోమల లార్వాను, గుడ్లను ఆహారంగా తీసుకుని దోమల సంతానాన్ని చాలా వరకు తగ్గించేస్తాయి. ఇలా 98 వార్డుల్లో గుర్తించిన 7,151 బావులు, చెరువుల్లో 8 లక్షల గంభూషియా చేపలు వదిలిపెట్టారు.

ఫ్రైడే డ్రైడేతో సత్ఫలితాలు



ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడే కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. ప్రజల్లో చైతన్యం కోసం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఖాళీ కొబ్బరి బొండాలు, ఫ్రిజ్‌ల వెనక ఉండే నీరు, ఏసీ మెషిన్ నీటిలో ఎడిస్ అనే దోమ పుడుతుంది. ఆ నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించాలి. నీటిని వారం పైగా నిల్వ చేయొద్దు. ఇంటికి వచ్చే జీవీఎంసీ సిబ్బందికి సహకరించి పరిసరాల్లో ఉండే నీటి నిల్వలను తొలగించాలి.

– దాడి సాంబమూర్తి, బయాలజిస్ట్, జీవీఎంసీ

రామమోహనరావుకు ఏయూ డాక్టరేట్


రామమోహనరావుకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

దొండపర్తి: పాలెపు రామమోహనరావుకు ఏయూ డాక్టరేట్ లభించింది. సహకార రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో వివిధ బ్యాంకుల పనితీరు ముల్యాంకనంపై ఆయన పరిశోధన చేశారు. ముఖ్యంగా పెర్ఫార్మెన్స్ ఎవాల్యూషన్ ఆఫ్ కోఆపరేటివ్ బ్యాంక్స్-ఏ కేస్ స్టడీ ఆఫ్ ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ అనే అంశంపై ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కుడుముల వెంకటరమణమూర్తి పర్యవేక్షణలో అధ్యయనం చేసి సమర్పించిన పరిశోధనకు ఆయనకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు రామమోహనరావుకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. విభాగం ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు పాల్గొని రామమోహనరావును అభినందించారు.